బల్దియా నిర్లక్ష్యం చిన్నారిని మింగేసింది

- నాలాలో కొట్టుకుపోయి బాలిక మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిహెచ్ఎంసి, జలమండలి నిర్లక్ష్యం ఓ చిన్నారిని మింగేసింది. డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం రోడ్డు తవ్వి..అధికారులు సరైన రక్షణ చర్యలు తీసుకోపోవడంతో ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, సికింద్రాబాద్, మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధి కళాసీగూడకు చెందిన శ్రీనివాసులు, రేణుకలకు కార్తిక్ (15), మౌనిక (11)లు సంతానం. శనివారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షానికి కళాసీగూడ ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డుపై మోకాల్లోతు నీరు నిలిచింది. ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పాల ప్యాకెట్ కోసం అన్నతో కలిసి ఇంటి నుంచి బైటకు వచ్చిన మౌనిక.. రోడ్డు సమీపంలో తవ్వి వదిలేసిన గుంతలో పడి నాలాలోకి జారిపోయి వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన డిఆర్ఎఫ్ సిబ్బంది..ప్రమాదం జరిగిన అరకిలోమీటర్ దూరంలోఉన్న నాలలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. కాగా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బేగంపేట సర్కిల్ ఎఇ, వర్క్ ఇన్‌స్పెక్టర్లను జిహెచ్ఎంసి కమిషనర్ సస్పెండ్ చేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు, బల్దియా రూ.రెండు లక్షల పరిహారం ప్రకటించింది.

జెఇఇ మెయిన్‌లో బిసి గురుకుల విద్యార్థుల హవా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జెఇఇ మెయిన్-2023 ఫలితాల్లో బిసి గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. 92 మంది బాలురు, 65 మంది బాలికలు కలిపి మొత్తం 157 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, బిసి గురుకులాల కార్యదర్శి మల్లయ్య బట్టు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలుర విభాగంలో కె నందు 94.06 పర్సెంటైల్, డి మనీష్ 92.20 పర్సెంటైల్, ఎల్ గౌతమ్ 89.52 పర్సెంటైల్, ఎ రాము 89.32 పర్సెంటైల్ సాధించారని వివరించారు. బాలకల విభాగంలో వి శివాణి 89.38 పర్సెంటైల్, ఎం రజినీ 89.11 పర్సెంటైల్ పొందారని తెలిపారు. మంచి మార్కులు సాధించి ఉన్నత విద్యను అభ్యసించేందుకు అర్హత సాధించిన విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందిని వారు అభినందించారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తి... ఆత్మగౌరవ బావుటా..

- నేడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ప్రారంభం
- సకల జనుల సంక్షేమ పాలనే లక్ష్యం : సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనేక త్యాగాలు, శాంతియుత పార్లమెంటరీ పంథాతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం, అనతి కాలంలోనే దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ట మహోన్నతంగా వెలుగులీనేలా, ప్రజల ఆత్మగౌరవం మరింత ఇనుమడించేలా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వినూత్నరీతిలో అత్యద్భుతంగా తెలంగాణ సచివాలయాన్ని నిర్మించుకున్నామని చెప్పారు. ఇది యావత్ తెలంగాణ సమాజం గర్వించదగ్గ గొప్ప సందర్భమని వ్యాఖ్యానించారు. "డాక్టర్ బిఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం" ప్రారంభోత్సవ శుభ సందర్భంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనేక అపోహలు సృష్టించిన విమర్శలు అడ్డంకులను దాటుకుంటూ ధృఢ సంకల్పంతో ప్రారంభమైన నూతన సచివాలయ నిర్మాణం, అనతి కాలంలోనే దేశానికే వన్నె తెచ్చేలా పూర్తయి, ప్రజలకు అందుబాటులోకి రావడం పట్ల సిఎం హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాల పరిపాలన అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత గొప్ప సాంకేతిక విలువలతో కూడిన నిర్మాణ కౌశలంతో సెక్రటేరియట్ పూర్తయిందన్నారు. అన్ని రకాల ప్రమాణాలను పాటిస్తూ, అనేక విశిష్టతలను సొంతం చేసుకున్న ఈ సౌధం, దేశంలోనే తొలి పర్యావరణ అనుకూల మహాద్భుత కట్టడమని వ్యాఖ్యానించారు. ప్రశాంతతను ప్రసాదించే దేవాలయం మాదిరి, చూస్తేనే కడుపు నిండే విధంగా.. అత్యంత ఆహ్లాదభరిత వాతావరణంలో ఉద్యోగులు పనిచేసేలా నిర్మితమైన సచివాలయం, ప్రభుత్వ యంత్రాంగం పనితీరును గొప్పగా ప్రభావితం చేస్తూ గుణాత్మక మార్పుకు బాటలు వేయనున్నదని చెప్పారు. మార్పుకనుగుణంగా ఎప్పటికప్పుడు తమను తాము తీర్చిదిద్దుకుంటూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుంటూ, వాటిని సాకారం చేసేందుకు సుపరిపాలన సాగేలా సెక్రటేరియట్ నిర్మాణం జరిగిందని సిఎం వివరించారు. ఒక రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరును పెట్టడం దేశంలోనే మొదటిసారి అని తెలిపారు. అంబేద్కర్ మహాశయుని పేరు పెట్టుకోవడం వెనుక సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ మహిళా, పేద వర్గాలకు సమాన హక్కులు దక్కాలనే సమున్నత లక్ష్యమున్నదని సిఎం అభిప్రాయపడ్డారు. ఎదురుగా తెలంగాణ అమరుల స్మారక జ్యోతి, పక్కనే ఆకాశమంత ఎత్తున అంబేద్కర్ మహాశయుడు రేపటికి దిక్సూచిగా నిలిచి నిరంతరం ఒక స్ఫూర్తిని రగిలిస్తుండగా, తెలంగాణ పాలనా సౌధం నుంచి జాతి మెచ్చే సుపరిపాలన రాష్ట్ర ప్రజలకు అందాలనే లక్ష్యంతో, తాత్విక, సైద్ధాంతిక అవగాహనతోనే అంబేద్కర్ మహాశయుని పేరును తెలంగాణ సచివాలయానికి పెట్టడం జరిగిందని సీఎం అన్నారు. దేశంలో అత్యంత చిన్న వయసున్న రాష్ట్రంగా, ఇతర రాష్ట్రాలతో పోల్చితే, తెలంగాణ సకల జనుల సంక్షేమ పాలనను దేశానికి ఆదర్శంగా అందిస్తున్నదని తెలిపారు. తెలంగాణ ప్రభ దేదీప్యమానమయ్యేలా, దార్శనికతతో సాధించిన ప్రగతి వెలుగులదారుల్లో, ప్రస్థానం అద్భుతంగా కొనసాగుతుందని కెసిఆర్ తన ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్‌ను అత్యంత గొప్పగా తీర్చిదిద్దడంలో అమోఘమైన పాత్ర పోషించిన, రాల్లెత్తిన కూలీలను, మేస్త్రీలను, నిర్మాణంలో కష్టించి పనిచేసిన అన్ని వృత్తుల నిపుణులను, అపురూపంగా మోడల్ అందించిన ఆర్కిటెక్టులను, విరామమెరుగక రేయింబవళ్లు పనిచేసిన కాంట్రాక్టు ఏజెన్సీలను, వారి ఇంజినీర్లను, ఆర్అండ్‌బి శాఖ మంత్రిని, ఉన్నతాధికారులను, ఇంజినీర్లను, సిబ్బందిని, నిర్మాణంలో పాల్గొన్న ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రతి ఒక్కరినీ సిఎం అభినందించారు. ఈ మేరకు శనివారం సిఎంఒ ఒక ప్రకటన విడుదల చేసింది.

టిఐడిసిలో నాలుగోసారి సిఐటియు జయకేతనం

- ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై చుక్కా రాములు విజయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లాలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలో గల టిఐడిసి పరిశ్రమలో శనివారం జరిగిన కార్మిక సంఘాల ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి సిఐటియు జయకేతనం ఎగురవేసింది. బిఎంఎస్ తరపున ఎమ్మెల్యే రఘునందన్‌రావు, సిఐటియు తరపున ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు పోటీపడ్డారు. పరిశ్రమలో మొత్తం 173 ఓట్లు ఉండగా.. రెండు ఓట్లు పోలు కాలేదు. మిగిలిన వాటిలో రఘునందన్‌రావుకు 84 ఓట్లు రాగా.. చుక్కా రాములుకు 87 ఓట్లు పోలయ్యాయి.

మూడు ఓట్ల మెజార్టీతో రఘునందన్‌రావుపై చుక్కా రాములు విజయం సాధించారు. ఈ సందర్భంగా పరిశ్రమ వద్ద జరిగిన ఊరేగింపు ప్రదర్శన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు సిఐటియుతోనే న్యాయం జరగుతుందన్నారు. కార్మికులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. హామీలన్నీ అమలుకు కృషి చేస్తామన్నారు. కార్మికులు మంచి విజయాన్ని అందించారని, ప్రత్యర్థి వాళ్ళు డబ్బులు పంచినా, మందు తాగించినా.. చివరికి సిఐటియునే గెలిపించారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.మల్లేశం, ఉపాధ్యక్షులు కె.రాజయ్య, టిఐడిసి నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్, చంద్రశేఖర్, వేణుగోపాల్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, యాదయ్య, ఇతర నాయకులు వి.ఎస్ రాజు, మధుసూదన్ రెడ్డి, శ్రీధర్‌రావు, సంతోష్ గౌడ్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టిఐడిసి పరిశ్రమలో విజయాన్ని పురస్కరించుకుని సిఐటియు సంగారెడ్డి జిల్లా కార్యాలయం వద్ద స్వీట్లు పంచుకుని కార్మికులు సంబురాలు జరుపుకున్నారు.

తెలంగాణ అభివృద్ధి గజినీలకు అర్థం కావట్లే..

- లింగాయతులను ఒబిసిలో చేర్చాలని తీర్మానం చేసినం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరిష్కరించాలి
- 12వ శతాబ్దంలోనే కుల రహిత సమాజం కోరిన బసవేశ్వరుడు
- సంగారెడ్డి పర్యటనలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పక్క రాష్ట్రంలో ఉన్న రజనీకాంత్‌కు అర్థమైంది. ఇక్కడే ఉన్న గజినీలకు మాత్రం అర్థం కావడం లేదు' అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన సంగారెడ్డి జిల్లాలోని కంది, సదాశివపేట, న్యాల్‌కల్ మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎంతో మారిపోయిందని, న్యూయార్క్‌లా కనిపిస్తుందని సూపర్ స్టార్ రజనీకాంత్ పేర్కొనడం విశేషమన్నారు. సిఎం కెసిఆర్ తొమ్మిదేళ్ల పాలనలో హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి కనిపిస్తుందని రజినీ అన్నారని గుర్తు చేశారు. కానీ, ఇక్కడున్న ప్రతిపక్షాలకు కనిపించడం లేదన్నారు. కాళేశ్వరం కట్టి కోటి ఎకరాలకు సాగునీరు ఇస్తున్నందుకు గద్దె దించుతారా అని నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగమే కాకుండా టి హబ్, టిఎస్ఐ పాస్‌లతో 15 లక్షల ప్రయివేటు కొలువులు ఇస్తున్నది నిజం కాదా అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు తాము భర్తీ చేస్తుంటే నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దొంగే దొంగ అన్నట్టుగా కాంగ్రెస్ వాళ్ల దొంగ దీక్షలు చేస్తున్నారన్నారు. 12వ శతాబ్దంలోని కుల రహిత సమాజం కోసం బసవేశ్వరుడు పోరాడారని గుర్తు చేశారు. కుల మతాలు ఏవైనా భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉన్న దేశం మనదని, అందరూ కలిసి ఉండాలనే బసవేశ్వరుడి సూక్తులను ఆచరణలో పాటించాలని అన్నారు. ఒబిసి రిజర్వేషన్ల కోసం లింగాయతులు ఎన్నో ఏండ్లుగా పోరాటం చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం లింగాయత్ సమాజాన్ని ఒబిసిలో చేర్చాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లింగాయతులను ఒబిసిలో కలిపేందుకు కృషి చేయాలని, దమ్ముంటే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. లింగాయత్‌ల గౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లింది సిఎం కెసిఆర్ మాత్రమే అన్నారు. ఆత్మగౌరవ భవనాల కోసం కోకాపేటలో రూ.30 కోట్ల విలువ చేసే స్థలం కేటాయించడమే కాకుండా భవన నిర్మాణం కోసం రూ.పది కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

నాల్కల్ మండలంలో కుంభమేళా జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులూ కలవకుండా సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కంది మండలంలోని వీరశైవ లింగాయత్ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపి బిబి పాటిల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాణిక్యరావు, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింత ప్రభాకర్, టిఎస్ ఎంఐడిసి చైర్మెన్, డిసిఎంఎస్ చైర్మెన్ శివకుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద వరదలో కొట్టుకుపోతున్న ధాన్యం

వరదలో ధ్యానం

ఆగమ్యగోచరంగా రైతుల పరిస్థితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగామ జిల్లా లింగాలగనపురం మండలంలో భారీ వర్షంతో ధాన్యం పూర్తిగా నీటిపాలైంది. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం శనివారం ఉదయం కురిసిన భారీ వర్షంతో కొట్టుకుపోయింది. ధాన్యం రాశులు నీటమునిగాయి. చేతికొచ్చిన పంట ఆగమైందని రైతులు శ్రీనివాస్ రెడ్డి, బొయిని సాయిలు, దేవనూరి భాస్కర్, బోయిన మైసయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు కోనుగోలు కేంద్రానికి తీసుకొస్తే.. వర్షానికి నీటి పాలైంది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. లేకపోతే తమ పరిస్థితి ఆగమ్యగోచరం. - రైతు బుర్రేడ్డి శ్రీనివాస్ రెడ్డి

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే తీసుకోవాలి

కోనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కోనుగోలు చేయాలి. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికి వచ్చాక వరుణుడు కన్నెర్ర చేసిండ్రు. ఎకరాకు యాభై వేల నష్టపరిహారం చెల్లించాలి.

- రైతు బొయిని సాయిలు

రెగ్యులరైజ్ చేయండి

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల దీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూనియర్ పంచాయతీల కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. శనివారం పలు జిల్లాల్లో ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట వారి దీక్షలకు ప్రజాసంఘాల నేతలు పలువురు సంఘీభావం తెలిపారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఎంపి రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. వీరి దీక్షలకు సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, కెవిపిఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి పరుశురాములు, బి ఆంజనేయులు, తదితరులు మద్దతు ప్రకటించారు. ఆమనగల్‌లో చేపట్టిన దీక్షలకు పిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి, కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు.

ఖమ్మం జిల్లాలో ముదిగొండలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల దీక్ష శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ సందర్శించి సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించే వరకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వేంసూరులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్, తల్లాడలో సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, బోనకల్‌లో ఎంపిపి కంకణాల సౌజన్య, ఏన్కూర్‌లో కాంగ్రెస్ నాయకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో కాంగ్రెస్ నాయకులు బట్టవిజయ్ గాంధీ సంఘీభావం తెలిపారు.

ధాన్యాన్ని పరిశీలిస్తున్న జూలకంటి

ధాన్యం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం మార్కెట్ యార్డ్‌లో పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలో పలు ఐకెపి కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐకెపి సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు కాక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలని, ఐకెపి సెంటర్లలో నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నెల రోజుల నుంచి కేంద్రంలో ధాన్యం వద్ద కాపలా కాస్తున్నారని, వాతావరణంలో మార్పుల వల్ల ఎప్పుడు వర్షం వస్తుందోనని ఆందోలన చెందుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ఎంత పంట వేశారు? ఎంత పంట ఐకెపి కేంద్రాలకు వస్తుందని ముందస్తు ప్రణాళిక ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కొన్ని ఐకెపి సెంటర్లలో ధాన్యం లోడ్ ఎత్తాలంటే రైతుల నుంచి అదనంగా డబ్బులు అడుగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలన్నారు. ఐకెపి కేంద్రాలకు వచ్చిన ధాన్యంపై కప్పడానికి టార్పాలిన్ కవర్లు కూడా ఇవ్వలేని దుస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రతిపాదికన ధాన్యాన్ని ఖరీదు చేయకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడ్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పిల్లుట్ల సైదులు ఉన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

- ఇందిరాపార్కు వద్ద ధర్నాలో 'ఐలూ' డిమాండ్

ధర్నాలో మాట్లాడుతున్న ఐలూ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యలు పరిష్కరించడంలో బార్ కౌన్సిల్‌తో పాటు రాష్ట్రప్రభుత్వం చొరవ చూపాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇందిరాపార్కు వద్ద 'ఐలూ' ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఐలూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, కె సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కె పార్థసారది, నగర అధ్యక్షులు ప్రవీణ్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు భారీగా తరలివచ్చిన న్యాయవాదులను ఉద్దేశించి వారు మాట్లాడారు.

2019, ఆ తర్వాత న్యాయవాదవృత్తిలో చేరిన వారందరికీ హెల్త్‌కార్డులు అందచేయాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత చనిపోయిన న్యాయవాదుల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తోందని, దీనివల్ల ఇన్సూరెన్స్ కంపెనీకి లాభమే తప్ప, న్యాయవాదులకు నష్టం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు చికిత్స కోసం చెల్లిస్తున్న రూ. రెండు లక్షల బీమా పరిమితిని రూ.ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల తల్లిదండ్రులకూ హెల్త్ కార్డులు ఇవ్వాలనీ, ప్రసవం సహా అన్ని చికిత్సలకు హెల్త్ కార్డులు వర్తింప చేయాలని కోరారు. జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులను నెట్‌వర్క్ జాబితాలో కలపాలని, సప్లిమెంటరీ డీడ్ ఆఫ్ ట్రస్ట్ పేరుతో చేసిన చట్టసవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 41(ఎ) సిఆర్‌పిసిని పోలీసులు దుర్వినియోగపర్చకుండా, కక్షిదారులు ఆర్థిక హింసకు గురికాకుండా న్యాయవాదుల రక్షణలోఉండేలా చట్ట సవరణ చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తేవాలని, కొత్తగా ఈ వృత్తిలోకి వచ్చేవారికి ఐదేళ్లపాటు నెలకు రూ.ఐదు వేలు చొప్పున భృతి ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు ఈ తరహా భృతిని అమలు చేస్తున్నాయని ఉదహరించారు. హైదరాబాద్‌లో న్యాయవిజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి, నిరంతర శిక్షణా తరగతులు, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చనిపోయిన న్యాయవాది కుటుంబానికి రూ.నాలుగు లక్షలు చెల్లిస్తోందని, దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. ఆరు లక్షలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన న్యాయవాదులకు ఇండ్లస్థలాలు ఉచితంగా లేదా కనీస ధరకు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌ను బార్ కౌన్సిల్ నిర్వహిస్తున్న సంక్షేమ నిధికి బదలాయించాలని డిమాండ్ చేశారు. పై అంశాల పరిష్కారం కోసం లా సెక్రటరీకి, అడ్వకేట్ జనరల్‌కు వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఐలూ రంగారెడ్డి జిల్లా నాయకులు గోవర్థన్, కొండల్‌రెడ్డి, కొత్తగూడెం బార్ అసోసియేషన్ నాయకులు ఎమ్ రమేష్‌కుమార్, కోశాధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూమ్స్
- రజక సంఘం రాష్ట్ర మహాసభలో మంత్రి ఎర్రబెల్లి
- జనగామలో భారీ ప్రదర్శన

సభలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మూడో మహాసభ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ అధ్యక్షతన జరిగిన "రజకుల రక్షణ" సభలో మంత్రి మాట్లాడారు. జనగామ జిల్లాలో దోబీఘాట్ నిర్మాణానికి సిఎం కెసిఆర్ రూ. రెండు వందల కోట్ల 70 లక్షలు కేటాయించారన్నారు. అందుకు భూమిని సేకరించాల్సి ఉందని చెప్పారు. అలాగే, పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో కోటి రూపాయలతో ఎకరం స్థలంలో చాకలి ఐలమ్మ పేరిట ఫంక్షన్ హాల్ నిర్మిస్తామన్నారు. ఇళ్లులేని రజకులందరికీ డబుల్ బెడ్ రూమ్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రజకుల కోసం చేసిందేమీ లేదని విమర్శించారు. రజకుల సమస్యలపై సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల సాధన.. : ఎమ్మెల్సీ అలుగుబెల్లి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో హక్కులను సాధించుకుందామని ఎమ్మెల్సీ అలుగుబల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. రజకుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆనాటి దొరల, పెత్తందారీ, పెట్టుబడి దారీ విధానాలు అమలు చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. అందుకోసం బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. దేశాన్ని అదానీ అంబానీలాంటి పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు యత్నిస్తుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపి ఇంటికి పంపాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. రజక సంఘం మహాసభలో ప్రవేశపెట్టిన సమస్యలతో కూడిన తీర్మానాలు సరియైనవేనన్నారు. వీటిని ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు.

జనగామలో మహాప్రదర్శన

సభకు ముందు జనగామలో స్థానిక క్రిస్టియన్ గ్రౌండ్ నుంచి వైష్ణవి గార్డెన్ వరకు రజకులు పెద్దఎత్తున ప్రదర్శనగా వచ్చారు. ఈ ర్యాలీ డప్పుల నృత్యాలు, ఆటపాటలతో ముందుకు సాగారు. ఈ మహాసభలో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ టి రాజయ్య, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సారయ్య, జనగామ జడ్‌పి చైర్మెన్ పాకాల సంపత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మోకు కనుక రెడ్డి, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేష్, నాయకులు వెంకటేశ్వర్లు, అంజయ్య, ప్రజా సంఘాల నాయకులు రాపర్తి రాజు, విజయ్, ధర్మభిక్షం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కొలోసియం స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రముఖ డిజైన్ డెస్టినేషన్ ది కొలోసియం హైదరాబాద్‌లో తమ నూతన స్టోర్‌ను ప్రారంభించింది. జూబ్లిహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను ఆసంస్థ సహ వ్యవస్థాపకులు నీరజ్ హర్కుట్ లాంచనంగా ప్రారంభించారు. ఈ క్యూరేటెడ్ సెంటర్‌లో ఫర్నిచర్, లైటింగ్, కిచెన్‌లు, వార్డ్‌రోబ్‌లు, హోమ్ డెకర్, సాఫ్ట్ ఫర్నిషింగ్‌లు ప్రదర్శనకు ఉంటాయన్నారు. 120 పైగా ఫర్నిచర్ బ్రాండ్‌లు, 80 పైగా లైటింగ్ బ్రాండ్‌లు, 200 పైగా హోమ్ డెకర్ యాక్సెసరీ బ్రాండ్‌ల ఉత్పత్తులు లభిస్తాయని నీరజ్ తెలిపారు.

సచివాలయ ప్రారంభోత్సవానికి వెళ్లను

బండి సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం ప్రారంభోత్సవానికి వెళ్లట్లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో గల ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'అది సచివాలయం మాదిరిగా లేదు. ఒవైసీ కళ్లలో ఆనందం చూడడం కోసం ఒక వర్గం వారిని సంతృప్తి పరిచేందుకు కట్టినట్టుగా ఉంది. బిజెపి అధికారలోకి వచ్చిన తర్వాత ఎవ్వరు సిఎం అయినా అందులో నేను అడుగు పెట్టను. భారతీయ, తెలంగాణ సంస్కృతిలో కట్టలేదు. సచివాలయ డోమ్‌లను కూల్చివేసి తెలంగాణ సంప్రదాయలకు అనుగుణంగా పునర్నిర్మించిన తరువాతే అందులో అడుగు పెడతా' అని స్పష్టం చేశారు. కర్ణాటకను ఎటిఎంలా వాడుకోవడానికి కాంగ్రెస్ ప్లాన్ చేస్తోందని విమర్శించారు. కర్ణాటకలో అధికారంలోకి వస్తే అక్కడి సొమ్మునంతా దేశమంతా తిరిగి ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చునేది ఆ పార్టీ ఆలోచన అని ఆరోపించారు. తెలంగాణలో దోచుకున్న సొమ్మును కెసిఆర్ జాతీయ పార్టీ పేరుతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల్లో ఖర్చు చేస్తూ లీడర్లను చేర్చుకునే పనిలో ఉన్నారని విమర్శించారు. సచివాలయంలో మసీద్‌కు ఐదుగుంటల జాగా కేటాయించి... నల్లపోచమ్మ గుడికి రెండున్నర గుంటలే ఇస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణలోని హిందూ సమాజమంతా ఆలోచించాలన్నారు. కేసీఆర్ పాలనలో బాంచన్ బతుకులు బతకాలా అని నిలదీశారు. అట్లాంటి సచివాలయానికి పోయినా ఒకటే పోకపోయినా ఒకటే అన్నారు.

సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

బోయినపల్లి వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్వేషపూరిత ప్రసంగాలు చేసి సెక్యులరిజాన్ని దెబ్బతీస్తే తీవ్ర నేరంగా పరిగణించి అలాంటి వ్యక్తులపై కుల, వర్గం, మతంతో సంబంధం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్న సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకమైందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఆ తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో సెక్యులరిజాన్ని కాపాడేందుకు సుప్రీం కోర్టు తాజా తీర్పు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కోర్టులు తీసుకున్నాయనీ, రాజ్యాంగాన్ని అనుసరించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై కూడా ఉంటుందన్న విషయాన్ని మరువకూడదని సూచించారు. లౌకికత్వంతో పాటు భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శమనీ, ఇటీవల కాలంలో దేశంలో అశాంతిని పురిగొల్పే విధంగా కొంత మంది వ్యక్తులు మాట్లాడుతున్నారని విమర్శించారు. విద్వేష పూరిత ప్రసంగాలపై ఫిర్యాదుతో సంబంధం లేకుండా సుమోటోగా తీసుకుని కేసులు నమోదు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయమని పేర్కొన్నారు.

రోడ్డెక్కిన రైతులు

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి ● తరుగు పేర క్వింటాల్‌కు 15 కిలోలు కోత పెట్టడంపై ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాలు.. కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేవు.. వాతావరణంలో మార్పులతో వర్షం ఎప్పుడు వస్తుందోనన్న ఆందోళనతో రైతులు ఉంటే.. తూకాలు వేయకుండా నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో కడుపు మండిన అన్నదాతలు రోడ్డెక్కారు. లారీలు లేవంటూ తూకం ఆపేయడం.. తరుగు పేర భారీగా కోత విధిస్తుండటాన్ని నిరసిస్తూ నల్లగొండ, సిద్దిపేట జిల్లాల్లో శనివారం ధర్నా రేశారు.

నల్లగొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం ఆపేయడంపై మార్కెట్‌యార్డు ఎదుట నాంపల్లి-హైదరాబాద్ ప్రధానరోడ్డుపై రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. నాలుగైదు రోజులుగా తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాకపోవడంతో గురువారం నుంచి కాంటాలు ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు లేవని ధాన్యం కొనుగోళ్లు జరపకపోవడం అన్యాయమన్నారు. లారీలు పంపించాలని పిఎసిఎస్ చైర్మెన్ గట్టుపల్లి నర్సిరెడ్డి నాలుగైదు రోజులుగా జిల్లా అధికారులతో మాట్లాడుతున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆయన కూడా రైతులకు మద్దతుగా రోడ్డుపై బైటాయించి ధర్నాలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న నాంపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ రావుల నాగరాజు తన సిబ్బందితో ధర్నా ప్రదేశానికి చేరుకొని జిల్లా అధికారులతో మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం వరకు లారీలు పంపిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పూలవెంకటయ్య, పిఎసిఎస్ డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, సతీష్, బిరుదోజు యాదమ్మ, గాదేపాక రాజు, పూల యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

రైస్ మిల్ యాజమాన్యం తీరుపై ఆగ్రహం

రైస్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్కపల్లి గ్రామ రైతులు రాజీవ్ రహదారిపై ధర్నా చేపట్టారు. సుమారు గంటపాటు రహదారిపై భారీగా వాహనాలు నిలిచాయి. దేవక్కపల్లిలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించిన తోటపల్లి శివారులోని శ్రీలక్ష్మి రైస్ మిల్ యాజమాన్యం తూకం పేరుతో నిలువు దోపిడీ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు తరుగు పేరున 15 కిలోల కోత విధించడానికి అంగీకరిస్తేనే ధాన్యం సేకరిస్తామని లేదంటే వెనక్కి పంపిస్తున్నారని రైతులు అన్నారు. రైతులకు అన్యాయం చేస్తున్న రైస్‌మిల్ యాజమాన్యంపై సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు, ఎస్ఐ ప్రవీణ్‌రాజ్ ఘటనాస్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బిజెపి కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ ఒంటేల సంపత్ రెడ్డి, రావుల రామక్రిష్ణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఒఆర్ఆర్ లీజు అతిపెద్ద స్కామ్

- వెయ్యి కోట్లు చేతులు మారాయి
- రూ. 30 వేల కోట్లకు కేవలం రూ.7380 కోట్లనే కట్టబెట్టారు
- అన్ని విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం
- టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్)ను లీజుకివ్వడం వెనుక దేశంలోనే అతిపెద్ద స్కామ్ అని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్ రెడ్డి ఆరోపించారు. లీజు వ్యవహారంలో రూ.వెయ్యి కోట్లు చేతులు మారాయని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏటా కనీసం పది శాతం పెరుగుతోందని అంచనా వేసినా కనీసం రూ. 30 వేల కోట్లు ఆదాయం వచ్చే ఒఆర్ఆర్‌ను రూ.7380 కోట్లకే ముంబాయి కంపెనీకి తాకట్టు పెట్టారని చెప్పారు. మొదట్లో లీజు ద్వారా రూ. పది వేల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. ముందుగా రూ.ఎనిమిది లేదా తొమ్మిది వేల కోట్లు అని చెప్పారనీ, ఇప్పుడు రూ.7380 కోట్లు వచ్చాయని తెలిపారు. ఈ వ్యవహారంలో దాగి ఉన్న మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు. ఒఆర్ఆర్ లీజుకు సంబంధించిన మొత్తం వ్యవహారం సోమేష్‌కుమార్ కనుసన్నుల్లో జరిగిందన్నారు. అర్వింద్‌కుమార్ సంతకం పెట్టారని తెలిపారు. ప్రభుత్వం దిగిపోయే ఆరు నెలల ముందు తీసుకున్నా ఏ నిర్ణయాలైనా వచ్చే ప్రభుత్వం సమీక్షిస్తుందని గుర్తు చేశారు. కెటిఆర్, అధికారులు సోమేష్‌కుమార్, అర్వింద్‌కుమార్ ఈ వ్యవహారంలో దోపిడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించదని హెచ్చరించారు. మేం అధికారంలోకి వచ్చాక మొట్టమొదట వీటిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. 2018 నుంచి ఒఆర్ఆర్ టోల్‌ను ఏయే సంస్థలు వసూలు చేశాయో, వాటికి టెండర్ రూపంలో లేదా నామినేషన్ రూపంలో కట్టబెట్టారో అనే విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్ల నుంచి ఒఆర్ఆర్ టోల్‌ను ఈగల్ ఇన్ఫ్రాకు కట్టబెట్టారని చెప్పారు. ఒఆర్ఆర్ రోజుకు రూ. 2 కోట్ల టోల్ వసూలు అవుతుందన్నారు. టెండర్ అవసరం లేకుండానే ఏడాదికి ఏడాది పొడిగించుకుంటూ కెటిఆర్ ఇందులో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్‌ను ఆదాయ వనరుగా కేటీఆర్ మిత్రబృందం ఉపయోగించుకుందన్నారు. ఇందుకు మాజీ సిఎస్ సోమేష్‌కుమార్, హెచ్‌ఎండిఎ కమిషనర్ అర్వింద్‌కుమార్, జయేష్ రంజన్ సహకరించారని, ఈ ఆదాయాన్ని శాశ్వతంగా ఉపయోగించుకునేందుకు కెటిఆర్ కుటుంబం ఆలోచించిందని చెప్పారు. తమ కుటుంబానికి లాభం ఉండదని గ్రహించి టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (టిఒటి) విధానంలో 30 ఏళ్ల ప్రయివేటు సంస్థకు కట్టబెట్టాలనే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డును కెటిఆర్ ప్రయివేటు కంపెనీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. ఈ లెక్క ప్రకారం వేల కోట్ల ఆదాయం వచ్చే రింగ్‌రోడ్‌ను ప్రయివేటుకు అమ్మేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలపై బిజెపి ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను సిఎం కెసిఆర్ అమ్ముతుంటే, బిజెపి నాయకులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని పేర్కొన్నారు. ఈ అంశంపై బిజెపి నేతలూ స్పందించాలని డిమాండ్ చేశారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించిందని గుర్తు చేశారు. హైదరాబాద్ మహా నగరానికి మణిహారంగా ఔటర్ రింగ్ రోడ్‌ను నిర్మించేందుకు గత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 6696 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వచ్చే ప్రతి వాహనం ఓఆర్ఆర్‌ను టచ్ చేయాల్సిందేనన్నారు. ఒఆర్ఆర్‌ను లీజుకు ఇవ్వాలన్న నిర్ణయంతో ప్రజలు ఔటర్ రింగ్ రోడ్‌ను వినియోగించుకోలేని పరిస్థితులొచ్చాయని అవేదన వ్యక్తం చేశారు. టోల్‌ఛార్జీలు పెంచుకునే వెసులుబాటుకూ టోల్ సంస్థకు కట్టబెట్టారని విమర్శించారు. పెట్టుబడులు అంటే మౌలికసదుపాయాలు కల్పించాలన్నారు. కానీ ఉన్నవాటిని అమ్మేసి దాన్ని పెట్టుబడిగా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారానికి దిగుతోందని విమర్శించారు. టెండర్ విధానాలపై ఇడి, సిబిఐ, సెంట్రల్ విజిలెన్స్‌సహా విచారణ సంస్థలన్నింటికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు

కెసిఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలి

- టిజెఎస్ జెండావిష్కరణలో కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సిఎం, మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతికి అడ్డూ, అదుపు లేకుండా పోయిందని తెలంగాణ జన సమితి అధ్యక్షులు కోదండరాం ఆరోపించారు. ఈ అవినీతి పాలనకు చరమగీతం పాడాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. శనివారం నాంపల్లిలోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఐదోవ ఆవిర్భావ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జన సమితి కార్యకర్త తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం సైనికుడిలా పోరాడాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఆర్భాట ప్రచారాలు చేస్తున్నదే తప్ప రాష్ట్రంలో ఎక్కడా నిర్మాణాత్మక అభివృద్ధి జరగడం లేదన్నారు. దళిత బంధు లబ్ధిదారుల దగ్గర ఎమ్మెల్యేలు రూ. మూడు లక్షల కమీషన్ తీసుకుంటున్నరని స్వయంగా సిఎం కెసిఆర్ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. గత ఐదేళ్లుగా ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం అలుపెరుగకుండా పోరాడుతున్నారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, రైతాంగ సమస్యలు, నిరుద్యోగం, ఫీజురియింబర్స్‌మెంట్, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం కోసం, యూనివర్శిటీల బాగుకోసం ఇలా అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, టిజెఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు సలీమ్ పాష, ఇతర నాయకులు నర్సయ్య, అరుణ్ కుమార్, రాంచందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఇళ్ల పంపిణీపై కెటిఆర్ తొలి సంతకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో లక్ష మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ మార్గదర్శకాల ఫైలుపై నూతన సచివాలయంలో తొలి సంతకాన్ని మంత్రి కల్వకుంట్ల తారకరామారావు చేయనున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నూతన సచివాలయ భవనంలో తనకు కేటాయించిన కార్యాలయంలోకి మంత్రి కెటిఆర్ ఆదివారం అడుగుపెట్టబోతున్నారు. నూతన సచివాలయంలోని మూడో అంతస్తులో గల తన కార్యాలయం నుంచి తన విధులను నిర్వర్తించనున్నారు.

రామరాజుకు కళా సేవా జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - కల్చరల్

ఖతర్ దేశం దోహా నగరంలోని పొడర్ పెరల్ స్కూల్ ఆడిటోరియంలో తెలుగు కళా సమితి నిర్వహణలో అక్కడి తెలుగు వారు ఉగాది వేడుకలు శుక్రవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వంశీ సంస్థల అధినేత విగ్నేస వికలాంగుల బాలబాలికల ఆశ్రమం వ్యవస్థాపకుడు వంశీ రామరాజును కళా సేవా జీవిత సాఫల్య పురస్కారంతో సన్మానించారు. ఖాతార్‌లోని భారత రాయబార కార్యాలయంలో రాజకీయ సమాచార వ్యవహారాల ప్రథమ కార్యదర్శి కర్రీ పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని రామరాజును సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు తాతాజీ ఉసిరికల రామరాజు సేవలను వివరించారు. ప్రవాస స్త్రీశక్తి అవార్డు గ్రహీత డాక్టర్ రాజారామ పద్మజ, సంస్థ అధ్యక్షులు హరీష్ రెడ్డి దాసరపల్లి, ఇండియన్ స్పోర్ట్స్ కౌన్సెల్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, దీపక్ శెట్టి కెఎస్.ప్రసాద్, సత్యనారాయణ మల్లిరెడ్డి, సీతాపతి అరికరేవుల సమితీ పూర్వ ప్రస్తుత కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. యువ గాయకులు చరణ్, శ్రీలతచే స్వర తరంగం సంగీత లహరి ఆకట్టుకుంది

టిఎన్‌జిఒ అధ్యక్షులుగా మామిళ్ల రాజేందర్

- ప్రధాన కార్యదర్శిగా మారం జగదీశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర నాన్ గెజిటెడ్ (టిఎన్‌జిఒ) కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మామిళ్ల రాజేందర్ రెండోసారి, ప్రధాన కార్యదర్శిగా మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జి వెంకటేశం, సహాయ ఎన్నికల అధికారిగా శశికాంత్‌రెడ్డి వ్యవహరించారు. టిఎన్‌జిఒ కేంద్ర సంఘం నాయకులతోపాటు 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరై శనివారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. కేంద్ర సంఘం ఎన్నికల్లో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిఎన్‌జిఒ అసోసియేట్ అధ్యక్షులుగా కస్తూరి వెంకటేశ్వర్లు, ఎం సత్యనారాయణగౌడ్, కోశాధికారిగా రామినేని శ్రీనివాసరావు, పదిమంది ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన మామిళ్ల రాజేందర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల సాధన కోసం ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉంటూనే పరిష్కరించుకుందామని చెప్పారు. త్వరలోనే ఇహెచ్‌ఎస్ కార్డులు, పిఆర్‌సి పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని అన్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల సాధన కోసం రాజేందర్ నాయకత్వంలో కలిసి పనిచేస్తానని చెప్పారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తోన్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు సిఐటియు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ నాయకులతో చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారి విధులను ఫీల్డ్ అసిస్టెంట్లు, విఆర్ఎలు, కారోబార్, బిల్ కలెక్టర్లకు అప్పగించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ సమ్మెకు ఇతర శాఖల్లోని ఉద్యోగులు సహకరించాలని కోరారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ కూడా మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పాండు, సీహెచ్.వెంకటయ్య, ఉపాధ్యక్షులు పి.సుధాకర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

జెఇఇ మెయిన్‌లో శ్రీచైతన్య రికార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జెఇఇ మెయిన్-2023 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థ సంచలన రికార్డు సృష్టించింది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ ఓపెన్ కేటగిరీలో 300కు 300 మార్కులతో ఆలిండియా ప్రథమ ర్యాంక్‌ను తమ విద్యార్థి వెంకట కౌండిన్య పొందారని చెప్పారు. కె.సాయినాథ్ శ్రీమంత్ టాప్ 10 ర్యాంక్‌లో నిలిచారని వివరించారు. అఖిల భారత స్థాయిలో టాప్‌టెన్‌లో రెండు, టాప్ 100లో 23 ర్యాంక్‌లు తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు పొందారని అన్నారు. అన్ని కేటగిరీల్లో కలిపి టాప్ వందలో 91 మంది ర్యాంకులు సాధించారని చెప్పారు. ఓపెన్ కేటగిరీలో టాప్ వెయ్యిలోపు 146 ర్యాంక్‌లు సాధించామన్నారు. టాప్ వంద ర్యాంకులు పొందిన వారిలో శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు 18 మంది ఉన్నారని వివరించారు. వంద పర్సెంటైల్ పొందిన వారిలో 15 మంది విద్యార్థులున్నారని చెప్పారు. ఘనవిజయం సాధించిన విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బిఎస్ రావు అభినందించారు.

నారాయణ విద్యార్థుల విజయదుందుభి

జెఇఇ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థ రికార్డు ర్యాంకులను సొంతం చేసుకుంది. ఈ మేరకు నారాయణ గ్రూప్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, శరణి నారాయణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓపెన్ కేటగిరీలో అఖిల భారత స్థాయిలో రెండు, ఐదు, ఆరు ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. టాప్ 100లో తమ విద్యార్థులు 25 ర్యాంకులను కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. లోహిత్ ఆదిత్య సాయి రెండో ర్యాంకు, కౌషల్ విజయ్ వార్గేయ ఐదో ర్యాంకు, సాయి దుర్గారెడ్డి ఆరో ర్యాంక్‌లను పొందారని వెల్లడించారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్
- లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద ధర్నా
- జాయింట్ మీటింగ్ పెట్టి సమస్యలను చర్చిస్తాం : జాయింట్ కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం చలో లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వివిధ రంగాల హమాలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ మాట్లాడుతూ హమాలీలు వ్యవసాయ మార్కెట్, కూరగాయలు, పళ్ల మార్కెట్, ఎఫ్ సి ఐ, సిమెంట్ గోడౌన్‌లో సివిల్ సప్లై, జిసిసి, బేవరేజ్, బజారు ముఠా, ఐకెపి, హమాలీలు, గ్రామీణ హమాలీలు, రైస్ మిల్, ఆయిల్ మిల్ రైల్వే ఆర్‌టిసిలో పనిచేసే హమాలీలందరి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హమాలీల సంక్షేమం కోసం నూతన సెక్రటేరియట్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి తొలి సంతకం చేసి పేద హమాలీలందరిని ఆదుకోవాలని కోరారు. పిఎఫ్ ఇఎస్ఐ. బోనస్ ప్రమాద బీమా ఆరోగ్య భీమా వంటి సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.. 55 సంవత్సరాల వయసు పైబడిన హమాలీలందరికీ కనీసం రూ. ఆరు వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ హమాలీ శ్రమతో ప్రభుత్వానికి ప్రభుత్వ ప్రయివేటు మార్కెట్లు ఎఫ్‌సిఐ, సివిల్ సప్లై యావరేజ్ కోల్డ్ స్టోరేజ్‌ల నుండి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా హమాలీల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవటం అన్యాయం అన్నారు. ప్రభుత్వం వెంటనే హమాలీలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. హాల్ హమాలి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు మాట్లాడుతూ 50 కిలోలకు మించిన బరువులను నిషేధించాలని ఐఎల్ఒ తీర్మానం ఉన్నప్పటికీ అనేక మార్కెట్లలో కూరగాయలు పళ్లు, అపరాలు 90,100 కేజీల బరువులు మోయించటం వల్ల అనేక అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. హమాలీల ను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

జాయింట్ కమిషనర్‌కు వినతిపత్రం

మూడు గంటల పాటు హమాలీలు పెద్ద ఎత్తున ధర్నా చేసి అనంతరం జాయింట్ కమిషనర్ గంగాధర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. గంగాధర్ హమాలీల వద్దకు వచ్చి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇచ్చారు. హమాలీలు అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి హమాలీల సమస్యలన్నీ చర్చించి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పి శ్రీకాంత్ హాల్ అమాలి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ ఉపాధ్యక్షులు చెన్నయ్య బి రాములు గోపాలస్వామి కార్యదర్శి పి సుధాకర్. యాదగిరి కోశాధికారి కనకయ్య సిఐటియు సౌత్ జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా కమర్షియల్

- ఆగని అమ్మ కడుపు కోతలు
- ప్రయివేటులో 80 శాతానికిపైగా ఆపరేషన్లు
- 'లైట్' తీసుకుంటున్న అధికార యంత్రాంగం
- తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం
- పట్టించుకోని డిఎంహెచ్ఒ కార్యాలయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జీవితంలో అమ్మవడం ఓ గొప్పవరం.. కానీ ఆ అమ్మతనాన్నీ ప్రయివేటు ఆస్పత్రులు పక్కా కమర్షియల్‌గా చూస్తున్నాయి. ప్రసవాన్ని పైసల ఆటగా మార్చారు. చాలా ఆరోగ్యకరమైన, ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన కాన్పులను.. ఆపరేషన్ థియేటర్లల్లో, గంభీరమైన, ప్రతిక్షణం ఆందోళన పరిస్థితుల్లో చేస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం సాధారణ కాన్పులు చేయాలని ప్రయివేటు ఆస్పత్రులకు నిజామాబాద్ జిల్లా గత కలెక్టర్ నారాయణరెడ్డి జారీ చేసిన ఆదేశాలు.. ఆయన బదిలీతో బుట్టదాఖలయ్యాయి. ఆ సమయంలో ప్రతి ఆపరేషన్‌పై సమీక్షలు నిర్వహించారు. అనవసర ఆపరేషన్లు చేసిన ఆస్పత్రులకు నోటీసులు జారీ చేసేందుకు సైతం వెనుకాడలేదు. ఆ సమయంలో జిల్లాలో సాధారణ ప్రసవాలు పెరిగాయి. కానీ ఆ కలెక్టర్ బదిలీతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రస్తుత కలెక్టర్ అటువైపు దృష్టి సారించకపోవడం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అమ్యామ్యాలకు అలవాటుపడటంతో

ప్రయివేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు 15 శాతం కూడా జరగడం లేదు. అదే సమయంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం 45 శాతం వరకూ జరగడం విశేషం. నిజామాబాద్ జిల్లాలో ప్రయివేటు ఆస్పత్రులు ప్రసవాలకు మళ్లీ ఆపరేషన్ బాట పట్టాయి. ఓ వైపు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ కాన్పుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. గర్భిణీలకు మొదటి నుంచి సాధారణ ప్రసవంపై అవగాహన కల్పిస్తున్నారు. సాధారణ కాన్పుతో వచ్చే ఆరోగ్య ప్రయోజనాలతోపాటు సిజేరియన్ జరిగితే తలెత్తే దుష్ఫరిణామాలు సైతం వివరిస్తున్నారు. దీంతో గర్భిణులు సాధారణ ప్రసవానికి మానసికంగా సిద్ధమవుతున్నారు. ఆ తరువాత ప్రసవాల సమయంలోనూ ఇబ్బందులు తలెత్తడం లేదు. కానీ ప్రయివేటు ఆస్పత్రుల్లో దీనికి పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. పాత కలెక్టర్ ఆదేశాలతో సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలపై ఓ స్టిక్కర్‌ను అతికించి మమ అనిపించారు. కానీ ఆచరణలో మళ్లీ ఆపరేషన్ల బాటపడుతున్నారు. ఈ యేడాది జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లో జరిగిన ప్రసవాల లెక్కలు పరిశీలిస్తే.. ప్రయివేటులో సాధారణ ప్రసవాల సంఖ్య భారీగా తగ్గింది. జనవరిలో 14 శాతం, ఫిబ్రవరిలో 15, మార్చిలో 11 శాతం మాత్రమే సాధారణ కాన్పులు జరిగాయి. అదే ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనవరిలో 39.43 శాతం, ఫిబ్రవరిలో 45.84, మార్చిలో 43.83 శాతం సాధారణ ప్రసవాలు అయ్యాయి.

సమీక్షలు కరువు..

గతంలో కలెక్టర్ నారాయణరెడ్డి ఉన్న సమయంలో ప్రతి ఆపరేషన్ సంబంధించిన కేస్ ఫైల్ తెప్పించుకుని స్టడీ చేశారు. అనవసరంగా ఆపరేషన్ చేసినట్టు భావిస్తే.. ఆయా ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు సైతం జారీ చేశారు. కానీ పరిస్థితి ఇప్పుడు ఇందుకు భిన్నంగా ఉంది. నారాయణరెడ్డి బదిలీ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు వైద్యశాఖకు సంబంధించి సాధారణ ప్రసవాలపై సమీక్ష సమావేశం జరగలేదు.

సమావేశం జరగలేదు : సుదర్శనం, డిఎంహెచ్ఒ

ప్రయివేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తూనే ఉంటాం. మొదటి ప్రాధాన్యత దానికే ఇవ్వాలని చెబుతున్నాం. అయితే కలెక్టర్ నారాయణరెడ్డి బదిలీ అయిన తరువాత ప్రయివేటు ఆస్పత్రులతో మళ్లీ సమావేశం జరగలేదు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేసుల వివరాలు

	సాధారణం	(శాతం	సిజేరియన్	(శాతం)
జనవరి	457	39.43	702	60.56
ఫిబ్రవరి	436	45.84	535	55.09
మార్చి	459	43.83	588	56.16

ప్రయివేటు ఆస్పత్రుల్లో కేసుల వివరాలు

	సాధారణం	(శాతం)	సిజేరియన్	(శాతం)
జనవరి	132	14.13	802	85.86
ఫిబ్రవరి	139	15.65	749	84.34
మార్చి	122	11.31	956	88.68